# పోలింగ్‌కు వేళాయే..



నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో పోలింగ్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద సందడి



డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో పంపిణీకి సిద్ధంగా ఉంచిన ఈవీఎంలు, వీవీ ప్యాట్లు



ఎన్నికల సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్తున్న పోలింగ్ అధికారులు



వీవీ ప్యాట్‌తో పోలింగ్ కేంద్రానికి బయలుదేరిన అధికారి



డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి ఈవీఎం, వీవీ ప్యాట్ తో బయలుదేరిన పోలింగ్ అధికారులు, సిబ్బంది



పోలింగ్ కేంద్రాలకు వెళ్లేందుకు బస్సుల్లో బయలుదేరుతున్న పీవో, ఏపీవోలు

## 595 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్

- జిల్లా కంట్రోల్ రూం నుంచి పర్యవేక్షణ
- ఈవీఎంల తరలించే బస్సులు, అధికారుల వాహనాలకు జీపీఆర్ఎస్ అనుసంధానం



కంట్రోల్ రూం నుంచి వెబ్‌కాస్టింగ్ ద్వారా పర్యవేక్షిస్తున్న దృశ్యం

నాగర్‌కర్నూల్, నవంబర్ 29: జిల్లాలోని 802 పోలింగ్ కేంద్రాలకు గాను 595 పోలింగ్ కేంద్రాలను వెబ్ కాస్టింగ్ ద్వారా పర్యవేక్షించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ ఉదయ్‌కుమార్ తెలిపారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లాస్థాయి ఎన్నికల కంట్రోల్ రూం ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా సిబ్బందితో ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో నిఘా కళ్లు వెబ్ కాస్టింగ్‌ను పక్కాగా ఏర్పాటు చేయాలని ఈడీఎంను ఆదేశించారు.ప్రశాంత ఎన్నికలకు జిల్లా ఎన్నికల యంత్రాంగం పకడ్బందీగా ఏర్పాటు చేసిందన్నారు. సమర్థంగా, పారదర్శకంగా పోలింగ్ నిర్వహణకు సాంకేతికతను వినియోగిస్తున్నట్లు ఆయన తెలిపారు. మారుమూల ప్రాంతాలు, సమస్యాత్మక పోలింగ్ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో మూడు నియోజకవర్గాల పరిధిలోని 106 సెక్టర్ అధికారుల వాహనాలకు జీపీఆర్ఎస్ అనుసంధానం చేసి వాహనాలు ఏ పరిధిలో ఉన్నాయో గుర్తించి ఇక్కడ సమస్య ఉందో అక్కడికి వెంటనే చేరేలా జిల్లా కంట్రోల్ రూమ్ నుంచి ఎప్పటికప్పుడు దిశా నిర్దేశాన్ని అందజేసి పోలింగ్ కేంద్రాల సమస్యలను అత్యంత తక్కువ సమయంలోనే పరిష్కరించేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా మూడు నియోజకవర్గాల పరిధిలోని ఎన్నికల సిబ్బందిని ఈవీఎంల ద్వారా తరలించేందుకు 100 ఆర్టీసీ బస్సులను వినియోగించినట్లు వీటికి జీపీఆర్ఎస్ అనుసంధానం చేసినట్లు తెలిపారు. ఏ బస్సు ఏ సెక్టర్‌కు కేటాయించాం, ఎన్ని పోలింగ్ కేంద్రాల సామగ్రిని ఎన్నికల సిబ్బందిని తరలింపు, బస్సు నెంబరు డ్రైవర్ ఫోన్ నెంబర్లతో సహా పర్యవేక్షిస్తూ బస్సుల మూమెంట్ ప్రక్రియను జీపీఆర్ఎస్ ద్వారా పర్యవేక్షణ కొనసాగిస్తున్నామన్నారు. అదేవిధంగా చెంచుపెంటల్లోని 9 పోలింగ్ కేంద్రాలకు ప్రత్యేకంగా వీడియో, ఫొటో కెమెరాల ద్వారా పోలింగ్ ప్రక్రియను రికార్డ్ చేస్తున్నట్లు తెలిపారు.198 సాధారణ పోలింగ్ కేంద్రాల్లో కూడా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లాలోని 802 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ప్రక్రియ మొత్తం నిఘా కళ్లతో పర్యవేక్షణ కొనసాగిస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. జిల్లా కంట్రోల్ రూం నోడల్ అధికారిగా ఈడీఎం నరేశ్‌తోపాటు ఎన్ఐసీ కోఆర్డినేటర్ హర్షద్ రాఘవేంద్ర, హేమంత్, సాయి, కీర్తన్, ప్రసాద్, గురుబ్రహ్మం, శ్రీకర్‌యాదవ్, తదితరులు జిల్లా ఎన్నికల కంట్రోల్ రూమ్ ప్రక్రియను కొనసాగించనున్నారు.

## ప్రత్యేక ఆకర్షణగా మోడల్ పోలింగ్ కేంద్రాలు

నాగర్‌కర్నూల్, నవంబర్ 19: 2023 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లాలో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఓటర్లను ఆకట్టుకునేందుకు మామిడి తోరణాలతో స్వాగతం పలుకుతూ ఏర్పాట్లు చేశారు. నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో ఒక్కో మండలంలో ఒకటి చొప్పున మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 111వ పోలింగ్ కేంద్రమైన నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, 3వ నెంబర్ గల తిమ్మాజపేట మండలం మరికల్ అప్పర్ ప్రైమరీ స్కూల్, 69వ నెంబర్ గల బిజినేపల్లి మండలం గంగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, తెలకపల్లి మండలంలోని 187వ పోలింగ్ కేంద్రం కేంద్ర సెంట్రల్ ప్రైమరీ పాఠశాల, తాడూరులోని 253వ కేంద్రమైన మండల పరిషత్ అప్పర్ ప్రైమరీ పాఠశాలను మోడల్ పోలింగ్ కేంద్రాలుగా గుర్తించారు. ఈ కేంద్రాల్లో అన్ని రకాల ఓటర్లకు సకల సౌకర్యాలు కల్పించారు. వికలాంగులకు ప్రత్యేక వీల్ చైర్, దివ్యాంగులకు సహాయకులను ఏర్పాటు చేశారు. మోడల్ పోలింగ్ కేంద్రంగా నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో జెడ్పీహెచ్ఎస్ కేంద్రాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. యువత, మహిళలు, దివ్యాంగుల ఓటింగ్ శాతం పెంచేందుకు ఎన్నికల సంఘం ఈ మేరకు చర్యలు తీసుకుంటున్నది



నాగర్‌కర్నూల్‌లోని మోడల్ పోలింగ్ కేంద్రం

## ఓటు వేసేందుకు ఏదైనా ధ్రువీకరణ పత్రంతో వెళ్లండి : కలెక్టర్

నాగర్‌కర్నూల్, నవంబర్ 29 : గురువారం 30న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌లో ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఓటరు గుర్తింపు కార్డు(ఎపిక్ కార్డు)కు ప్రత్యామ్నాయంగా 12 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకటి కలిగి ఉండాలని కలెక్టర్ ఉదయ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఓటరు గుర్తింపు కార్డు, ఆధార్, ఉపాధిహామీ జాబ్ కార్డు, బ్యాంకు, తపాలా కార్యాలయం జారీ చేసిన ఫొటోతో కూడిన పాస్‌బుక్, కేంద్ర కార్మిక శాఖ జారీ చేసిన ఆరోగ్య బీమా స్మార్ట్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డు, రిజిస్ట్రార్ జనరల్ అండ్ సెన్సెస్ కమిషనర్ ఇండియా(ఆర్టీఐ), నేషనల్ పాపులేషన్ రిజిస్టర్(ఎన్‌ఎఐ) కింద జారీ చేసిన స్మార్ట్ కార్డు, భారతీయ పాస్‌పోర్ట్, ఫొటోతో కూ డిన పెన్షన్ పత్రాలు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, పీఎస్‌యూలు, పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలు జారీ చేసిన ఉద్యోగ గుర్తింపు కార్డులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు జారీ చేసిన అధికారిక గుర్తింపు కార్డులు, కేంద్ర సామాజిక న్యాయ సాధికారత మంత్రిత్వ శాఖ జారీ చేసిన యూనిక్ డిజేబుల్ గుర్తింపు కార్డు (యూడీఐడీ)లు కలిగి ఉండాలని కలెక్టర్ చెప్పారు. ఈ 12 కార్డులో ఏ గుర్తింపు కార్డు ఉన్నా పోలింగ్ కేంద్రానికి నేరుగా వెళ్లి ఓటు వేయవచ్చునని కలెక్టర్ వెల్లడించారు.

## ప్రచారంలో పాల్గొన్న ఇద్దరు ఉపాధ్యాయుల సస్పెన్షన్

నాగర్‌కర్నూల్, నవంబర్ 29 : ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఇద్దరు ఉపాధ్యాయులను సస్పెండ్ చేసిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లాలో బుధవారం చోటు చేసుకున్నది. ఈమేరకు వారికి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఉదయ్‌కుమార్ సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు. అచ్చంపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న ఇద్దరు ఉపాధ్యాయులను విధుల నుంచి తొలగిస్తు సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు. కొల్లాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ సోషల్ ఉపాధ్యాయుడు కె.రామ్‌జీ, ఉప్పునుంతల మండలం పులియానాయక్ తం డా ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఎస్జీటీ ఉపాధ్యాయుడు కే.రాజులను విధుల నుంచి తొలగించాలని కలెక్టర్ ఆదేశించారు.

## డబ్బులు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలపై కేసు నమోదు

కల్వకుర్తి రూరల్, నవంబర్ 29 : ఓటర్లను ప్రలోబ పెట్టేందుకు కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం డబ్బులు, ఓటరు స్లిప్పులతో పోలీసులకు పట్టుబడినట్లు ఎస్సై రమేశ్ తెలిపారు. కల్వకుర్తిలోని విద్యానగర్ కాలనీలో ముగ్గురు కాంగ్రెస్ కార్యకర్తలు ఓటర్లకు డబ్బులు పంపిణీ చేస్తున్న విషయం తెలిసిన తమ సిబ్బంది వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద రూ.30వేల నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.